




బాలికల హవా..!

ఇంటర్-2024 ఫలితాల విడుదల





అనంతపురం విద్య, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షల్లో ఎప్పటి లాగే బాలికలు సత్తా చాటారు. బాలుర కంటే మెరుగైన ఫలితాలు సాధించారు. గతంతో పోలిస్తే.. జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరిగింది. బోర్డు కార్యదర్శి శుక్రవారం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను ప్రకటించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 78 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా పదో స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణత సాధించడంతో రాష్ట్రంలో జిల్లాకు 16వ స్థానం దక్కింది. ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించవచ్చు. ఇవే తేదీల్లో రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సప్లిమెంటరీ పరీక్షలు మే నెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకూ నిర్వహిస్తారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు ఉంటాయి. ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు, ఇంప్రూవ్‌మెంట్ కోరుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

78 శాతం ఉత్తీర్ణత..

ఇంటర్-2024 పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 58 కేంద్రాల్లో నిర్వహించారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ వరకూ పరీక్షలు జరిగాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,653 మంది పరీక్షలకు హాజరుకాగా 12,210 మంది ఉత్తీర్ణులయ్యారు. 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి ఏడాది 21,826 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 13,115 మంది ఉత్తీర్ణులయ్యారు. 60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 37,479 మంది హాజరు కాగా 25,325 మంది ఉత్తీర్ణులయ్యారు. 12,154 మంది ఫెయిల్ అయ్యారు.

ఇంతమంది తప్పారు..

- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎకనామిక్స్‌లో 832 మందికిగానూ 167 మంది, సివిక్స్‌లో 846 మందికిగాను 160 మంది ఫెయిలయ్యారు. ఫిజిక్స్ 979 మందికిగానూ 152, ఇంగ్లీష్‌లో 1,839 మందికిగానూ 123, కామర్స్‌లో 570 మందికిగానూ 114, గణితం-2ఏ 503 మందికిగానూ 108, తెలుగులో 1,381 మందికిగానూ 103, గణితం 2బిలో 501 మందికిగానూ 99 మంది, బాటనీ 489 మందికిగానూ 85 మంది, కెమిస్ట్రీ 979మందికిగానూ 76 మంది, జువాలజీలో 488 మందికిగానూ 41 మంది, హిస్టరీలో 288 మందికిగానూ 25 మంది, సంస్కృతం 77 మందిలో 10 మంది ఫెయిల్ అయ్యారు.
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇంగ్లీష్‌లో 3,344 మందికిగానూ 1169 మంది, ఎకనామిక్స్‌లో 1,735 మందికిగానూ 791, సివిక్స్‌లో 1,720 మందికిగానూ 591, ఫిజిక్స్‌లో 1,559 మందికిగానూ 519 మంది, కెమిస్ట్రీలో 1,567 మందికిగానూ 500 మంది, కామర్స్‌లో 1,069 మందిలో 420 మంది, గణితం 1ఏ 814 మందిలో 292 మంది, జువాలజీలో 792 మందిలో 244 మంది, బాటనీలో 784 మందిలో 235 మంది, హిస్టరీలో 654 మందిలో 215 మంది, సంస్కృతంలో 78 మందికిగానూ 34 మంది, హిందీలో 533 మందికిగానూ 21 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

ద్వితీయ సంవత్సరం 78 శాతం పాస్

రాష్ట్రంలో జిల్లాకు పదో స్థానం

ప్రథమ సంవత్సరం 60 శాతం ఉత్తీర్ణత..

16వ స్థానం

పరీక్షలు రాసింది 37,479 మంది..

పాసైంది 25,325 మంది

18 నుంచి 24 వరకూ సప్లీ పరీక్షలకు ఫీజు చెల్లింపు అవకాశం

అవే తేదీల్లో రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ ఫీజు కూడా..

మే 24 నుంచి జూన్ 1 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు

యాజమాన్యం	ప్రథమ సంవత్సరం (జనరల్)	ద్వితీయ సంవత్సరం (జనరల్)	ప్రథమ సంవత్సరం (ఒకేషనల్)	ద్వితీయ సంవత్సరం (ఒకేషనల్)
ప్రభుత్వ	38.25 శాతం	64.76 శాతం	53.56 శాతం	70.23 శాతం
ఎయిడెడ్	19.81 శాతం	45.77 శాతం	--	--
వెల్ఫేర్	82.90 శాతం	87.01 శాతం	--	--
కేజీబీవీ	46.38 శాతం	74.49 శాతం	82.76 శాతం	94.87 శాతం
ఏపీ మోడల్	49.30 శాతం	69.41 శాతం	--	--
ప్రైవేట్	66.15 శాతం	81.34 శాతం	65.71 శాతం	79.69 శాతం

అమ్మాయిలే మెరుగు..

ఇంటర్ ఫలితాల్లో బాలికలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సులకు 8,464 మంది బాలికలు పరీక్షలు రాశారు. వీరిలో 6,861 మంది పాసై.. 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 7,189 మంది పరీక్షలు రాయగా.. 5,319 మంది పాసై.. 74 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం జనరల్ కోర్సుల్లో బాలికలు 11,203 మంది పరీక్షలు రాయగా.. 7,307 మంది పాసై.. 65.22 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 10,623 మంది పరీక్షలు రాయగా.. 5,808 మంది పాసై.. 54.67 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో 599 మంది బాలికలు పరీక్షలు రాశారు. వీరిలో 540 మంది పాసై.. 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 473 మందికిగాను 267 మంది పాసై.. 56 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో బాలికలు 949 మందికి గాను735 మంది పాసై.. 77.45 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 912 మందికిగాను 355 మంది పాసై.. 38.92 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మెరుగుపడ్డ హాస్టల్ విద్యార్థులు

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో 82.9 శాతం, ద్వితీయ సంవత్సరంలో 87.01 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. యాజమాన్యాల వారీగా ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం ఇలా ఉంది.



మహాశ్రీ (940 మార్కులు)

జిల్లా టాప్.. బొమ్మనహాళ్

కేజీబీవీలో వందశాతం, ప్రభుత్వ కాలేజీలో 98 శాతం ఉత్తీర్ణత

బొమ్మనహాళ్, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాలలో బొమ్మనహాళ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) జిల్లా ప్రథమ స్థానంలో నిలిచాయని ప్రిన్సిపాళ్లు మోహన్‌కుమార్, కమలమ్మ శుక్రవారం తెలిపారు.

- కేజీబీవీలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 14 మంది పాసై.. వందశాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మొదటి సంవత్సరం 35 మంది విద్యార్థులకు గానూ 34 మంది ఉత్తీర్ణత సాధించి, 97 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. 500 మార్కులకు గాను మొదటి సంవత్సరం విద్యార్థినులు ఐశ్వర్య 408, సాయికీర్తన 407, లావణ్యలక్ష్మి 406 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో విద్యార్థినులు 1000 మార్కులకు గాను శాంతి 752, గంగమ్మ 717, రమ్య 712, ఎస్.ఐన్రిన్ 711 మార్కులు సాధించారు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 109 మందికిగానూ 107 మంది పాసై 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 228 మందికి గాను 204 మంది పాసై 89.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో ఉంతకల్లు గ్రామానికి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మహశ్రీ 940 మార్కులు సాధించారు. సీఈసీలో బి.అక్షయ 922 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఎంపీసీ విద్యార్థి మహ్మద్ అదిల్ 408 మార్కులు, నందిని 406 మార్కులు సాధించారు.



మహ్మద్ అదిల్ (408 మార్కులు)

పేదింటి వజ్రాలు

ఏటికి ఎదురీది.. జిల్లా అగ్రస్థానంలో నిలిచారు

అనంతపురం విద్య, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో పేదింటి విద్యార్థులు మెరిశారు. కుటుంబ ఇబ్బందులను దాటుకుని.. జిల్లా టాపర్లుగా నిలిచారు. జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో సత్తా చాటుకున్నారు. బైపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఓ రైతు బిడ్డ రమ్యశ్రీ 436 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచారు. మరో విద్యార్థిని త్రైత ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 991 మార్కులు సాధించి జిల్లా అగ్రస్థానంలో నిలిచారు. పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు, జిల్లా ఖ్యాతిని పెంచారు.

బైపీసీలో మొదటి సంవత్సరంలో రమ్యశ్రీకి 436 మార్కులు

ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో త్రైతకు 991 మార్కులు

రైతు బిడ్డ బైపీసీ టాపర్



జూనియర్ ఇంటర్ విద్యార్థిని డి.రమ్యశ్రీ స్వస్థలం వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురం. తల్లిదండ్రులు పుష్పవతి, వెంకటేష్. వీరిది వ్యవసాయ కుటుంబం. రమ్యశ్రీ 10వ తరగతిలో 557 మార్కులు సాధించింది. ప్రస్తుతం నగర శివారులోని తేజ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. బైపీసీలో 440 మార్కులకుగానూ 436 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. 'పదో తరగతిలో 557 మార్కులు రావడం, మాది రైతు కుటుంబం కావడంతో తేజ కాలేజీలో ఉచితంగా చదువు చెప్పారు. కష్టపడి చదవడంతో 436 మార్కులు వచ్చాయి. నీట్‌కు ప్రిపేర్ అవుతున్నా. బాగా చదవి మంచి స్థాయికి చేరాలన్నది నా కల' అని రమ్యశ్రీ ఆంధ్రజ్యోతితో తన ఆనందం పంచుకుంది.

ఫొటోగ్రాఫర్ కూతురికి 991 మార్కులు




ఇంటర్ ఎంపీసీలో 991 మార్కులు సాధించింది ఆవులపాటి త్రైత. ఆమె తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం, రాజ్యలక్ష్మి. అనంతపురం నగరంలోని భాగ్యనగర్‌లో నివాసం ఉంటారు. పదో తరగతిలో త్రైత 585 మార్కులు సాధించింది. నగరంలోని నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివి.. ఎంపీసీలో 991 మార్కులు సాధించింది. దీంతో ఆ కుటుంబంలో ఆనందం నిండింది. 'నాకు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లడం చాలా ఇష్టం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వంటి రంగాల్లో ప్రావీణ్యం సంపాదించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నది నా ఆశయం' అని త్రైత పేర్కొంది. త్రైత తండ్రి ఓ ఫొటోగ్రాఫర్ కావడం గమనార్హం.

సివిల్స్ రాస్తా..



ఉరవకొండ మండలం చీకలగుర్కి గ్రామానికి చెందిన మంజునాథ్‌కు ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470కిగానూ 467 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు ఓబులేసు, సులోచన. వీరికి ఐదున్నర ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. మంజునాథ్ శ్రీచైతన్య టాలెంట్ స్కూల్‌లో పదో తరగతి చదివి.. 577 మార్కులు సాధించాడు. వివేకానంద జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. 'నా తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. సివిల్స్ రాసి మంచి ఉద్యోగం సంపాదించి.. మా అమ్మానాన్నలను బాగా చూసుకుంటా..' అని మంజునాథ్ అన్నాడు.

తండ్రి లేకున్నా..



గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన శృతి.. తండ్రి లేకున్నా తల్లి సహకారంతో, దాతల అండతో బాగా చదువుకుంది. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకుగానూ 464 మార్కులు సాధించింది. ఈమె తల్లిదండ్రులు బాలు, వరలక్ష్మి. తండ్రి ఇటీవల మరణించారు. పదో తరగతిలో 561 మార్కులు సాధించింది. తండ్రిలేని విద్యార్థినికి ఉచితంగా చదువు చెప్పడానికి ఓ కాలేజీ ముందుకు వచ్చింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. 'నాన్న చనిపోవడంతో తేజ కాలేజీ ఉచితంగా చదవించడానికి ముందుకు వచ్చింది. 464 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. జేఈఈకి ప్రిపేర్ అవుతున్నా. భవిష్యత్తులో సీఏ చేయాలన్నది నా ఆశయం' అని పేర్కొంది.

ఉష్ణోగ్రతలు	అనంతపురం
గరిష్ఠం కనిష్ఠం	39.0 27.0

పత్తి ధర పతనం

ధర పెరుగుతుందని.. ఇళ్లలో నిల్వ

మద్దతు ధరకు కొనుగోలు చేయని ప్రభుత్వం

నాణ్యత లేదని తిప్పి పంపుతున్న సీసీఐ

2 ఏళ్లుగా నష్టపోతున్న రైతు



పామిడి మండలంలో నిల్వ చేసిన పత్తి

పత్తి ధరలు బహిరంగ మార్కెట్‌లో పతనమౌతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి దిగుబడులు భారీగా తగ్గాయి. ఇలాంటి సమయంలో ధరలు కూడా భారీగా తగ్గడంతో రైతులు కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. రెండేళ్లుగా ధరలు తక్కువగానే ఉంటున్నాయి. దీంతో దిగుబడులను ఎక్కువ మంది రైతులు ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయడం లేదు. రెండు మాసాల క్రితం గుత్తి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా, ఒక్క క్వింటం పత్తిని కూడా కొనలేదు. నాణ్యతలేదన్న సాకుతో దిగుబడులను కొనడం లేదని రైతులు నిట్టూరుస్తున్నారు. విషయం తెలిసినా ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

\- అనంతపురం అర్బన్/పామిడి

ఇంట్లోనే నిల్వ చేశా..



బహిరంగ మార్కెట్‌లో ధర ఆశించినంత లేకపోవడంతో 500 క్వింటాళ్ల పత్తి ఇంట్లో నిల్వ చేశాను. గత ఏడాది ఖరీఫ్‌లో 30 ఎకరాల్లో పంట సాగు చేశాను. ఎకరాకు రూ.35వేలు పెట్టుబడి పెట్టాను. ఈ సారి ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. గుత్తి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా, నాణ్యత లేదంటూ వెనక్కి పంపారు.

\- హనుమంతరెడ్డి, గజరాంపల్లి, పామిడి మండలం



పత్తి పంటను కోస్తున్న రైతులు (ఫైల్)

ప్రభుత్వ వైఫల్యం

పత్తి రైతుకు మద్దతు ధర కల్పించి, కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రతి ఏడాది గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి కేవలం గుత్తి మార్కెట్ యార్డులో, రెండు మాసాల క్రితం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోనే సరిపెట్టారు. మద్దతు ధర రూ.7,020గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నాణ్యతను బట్టి క్వింటం రూ.6200 నుంచి రూ.7020 వరకు కొనుగోలు చేస్తామని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు ప్రకటించారు. ఇదంతా నిజమేనని నమ్మిన రైతులు, ఆర్బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గుత్తి మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి పత్తి శాంపిల్ తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఈసారి ఒక్క రైతు నుంచి కూడా పత్తి కొనుగోలు చేయలేదు.



రెండేళ్లుగా ఇళ్లలోనే..

2023-24 ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 51వేల హెక్టార్లల్లో పత్తి పంటను సాగు చేశారు. 2022-23లో 77వేల హెక్టార్లల్లో పత్తి పంట సాగైంది. ఈ సారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు విస్తీర్ణంతోపాటు పత్తి దిగుబడి కూడా తగ్గింది. వర్షాలు సకాలంలో పడితే ఎకరానికి 8 నుంచి 15 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ఈ సారి కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు క్వింటం, మరికొన్ని ప్రాంతాల్లో రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. రెండేళ్ల క్రితం క్వింటం పత్తి రూ.10 వేలు ధర పలికింది. గత ఏడాది నాణ్యతనుబట్టి క్వింటం రూ.7 వేల నుంచి రూ.8వేల దాకా ఉండింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తి నాణ్యతనుబట్టి పాత పత్తి క్వింటం రూ.5500 నుంచి రూ.6 వేల దాకా పలుకుతోంది. కొత్త పత్తి క్వింటం రూ.7200 నుంచి రూ.7600 దాకా పలుకుతోంది. గత నెలాఖరుతో జిల్లాలో పత్తి పంట కోతలు పూర్తయ్యాయి. ధర తక్కువగా ఉండటంతో రెండేళ్లుగా పత్తి పంటను ఎక్కువ మంది రైతులు తమ ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. సాధారణంగా పత్తి దిగుబడి తక్కువగా ఉన్నప్పుడు ధరలు పెరగాయి. ప్రస్తుతం అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. దళారులు కుమ్మక్కై రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

బోనస్ ప్రకటించాలి..



ధరలు తక్కువగా ఉండటంతో రెండేళ్లుగా ఎక్కువ మంది రైతులు ఇళ్లలోనే పత్తి పంటను నిల్వ చేసుకున్నారు. నాణ్యతా ప్రమాణాల పేరుతో పత్తిని కొనుగోలు చేయకపోవడం దారుణం. మద్దతు ధరతో కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ సారి దిగుబడి తగ్గినా ధరలు పెరగలేదు. దళారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారు. పత్తికి మద్దతు ధర రూ.7020తోపాటు రూ.2వేలు బోనస్ ప్రకటించాలి. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

\- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

దిగుబడి సరిగా రాలేదు..



30 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25వేలు పెట్టుబడి పెట్టాను. వర్షాలు సకాలంలో పడితే ఎకరాకు 10- 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ ఈ సారి కేవలం 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రెండేళ్లుగా పత్తి ఇంట్లోనే నిల్వ చేశాం. పెట్టుబడి కోసం తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు అధికమవుతున్నాయి. ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

\- దేవేంద్రరెడ్డి, రామరాజుపల్లి, పామిడి మండలం

శ్రీనివాసుడిగా శ్రీరామచంద్రుడు



తాడిపత్రి ఆర్పీ స్వామి కల్యాణ మండపంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీనివాసుడి అలంకరణలో శ్రీరామచంద్రమూర్తి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాముని ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీరామచంద్రమూర్తిని దర్శించుకున్నారు.

\- తాడిపత్రిటౌన్

రెండు నెలలు ఆగండి..!

మళ్లీ విధుల్లోకి తీసుకుంటాం

ఫీల్డ్ అసిస్టెంట్లకు డ్వామా అధికారి భరోసా

వైసీపీ ఒత్తిళ్లకు తలొగ్గి.. టీఓసీతో సరి



వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్: వైసీపీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఫీల్డ్ అసిస్టెంటర్లకు డ్వామాలో ఓ అధికారి అండగా నిలిచారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి.. 'ప్రచారం చేసుకోండి..' అని సంకేతాలు ఇచ్చారు. ఇప్పటికే ప్రచారంలో పాల్గొని.. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన పలువురిపై తూతూ మంత్రపు చర్యలతో సరిపెట్టారు. 'రెండు నెలలు ఆగండి. తిరిగి విధుల్లోకి తీసుకుంటాం. ఎలాగూ ప్రచారంలో ఉన్నారు. మీ పని మీరు చేసుకోండి. మీకు ఎటువంటి ఇబ్బంది ఉండదు' అని ఆ అధికారి భరోసా ఇచ్చారు. కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారంలో పాల్గొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో ప్రచారంలో పాల్గొన్న ఉపాధి హామీ సిబ్బందికి షోకాజ్ నోటీసు జారీ చేసిన డ్వామా అధికారులు, వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఆదేశాలతో రెండు నెలల పాటు తాత్కాలికంగా విధుల నుంచి (టెంపరరీ ఔట్ ఆఫ్ సర్వీస్-టీఓసీ) పక్కన పెట్టారు. 'ఏప్రిల్, మే నెలల్లో ప్రచారంలో ఉండండి, జూన్ లేదా జూలైలో తిరిగి విధుల్లోకి తీసుకుంటాం' అని డ్వామా ఉన్నతాధికారి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 12 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను టీఓసీలో ఉంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

చర్యలు మానేసి..

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను టీఓసీలో పెడుతూ.. అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శింగనమల మండలంలో లోలూరుకు చెందిన అంజనరెడ్డి, ఆకులేడు గంగాధర్, నాగులగుడ్డం భాస్కర్, చక్రాయపేట రమణారెడ్డి టీఓసీ జాబితాలో ఉన్నారు. రాప్తాడు మండలంలో గొండ్లపర్తి-విజయశంకర్, బొమ్మేపర్తి-రమణారెడ్డి, కూడేరు మండలంలో మరుట్ల బయ్యపురెడ్డి, డి.హీరేహాళ్ మండలం పులకుర్తిలో విజయకుమార్, విడపనకల్లు మండలం హావళిగికి చెందిన మల్లికార్జునను టీఓసీలో ఉంచారు. మరో ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలను గోప్యంగా ఉంచారు. వైసీపీకి అనుకూలంగా డ్వామా అధికారులు నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా ఎన్నికల అధికారి ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

చీరలు తరలిస్తున్న వాహనం సీజ్

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 12: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చీరలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఓబుళాపురం చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా బళ్లారి నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశామన్నారు. అందులో సుమారు 2,380 చీరలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఆ చీరలకు సంబంధించి రికార్డులు లేకపోవడంతో వెంటనే ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.



సేవలు లో.. అవినీతి హై

- విద్యుత్‌శాఖ కార్యాలయంలో యథేచ్ఛగా అక్రమాలు
- ప్రతి పనికీ రేటు కట్టి మరీ ఉద్యోగుల దోపిడీ
- వాటాలు తీసుకొని.. సహకరిస్తున్న ఉన్నతాధికారులు
- ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇతర సామగ్రి విక్రయాలు
- 'నార్పల' అక్రమాలపై నేటికీ చర్యలు శూన్యం



విద్యుత్ శాఖ కార్యాలయం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12: విద్యుత్‌శాఖలో ఉద్యోగులు సేవలను నిర్లక్ష్యం చేస్తూ... విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. సంస్థ వస్తువులను ఉద్యోగులు అక్రమంగా అమ్ముకొంటున్నారు. వారిపై చర్యలు తీసుకోవడం అటుంచి... కనీసం అడిగే నాథుడే కరువయ్యాడు. శాఖలోని ఉద్యోగులు ప్రతి ఒక్కదానికి రేటుకట్టి మరీ దండుకుంటున్నారు. ఈ దోపిడీలో కొంత ఉన్నత స్థాయి అధికారులకూ వాటాలు వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో అక్రమార్కుల తప్పులను కప్పిపుచ్చుతూ.. వారి అండగా నిలుస్తున్నారు. దీంతో ఉద్యోగులు మరింత అక్రమాల్లో పేట్రేగిపోతున్నారు. నార్పల మండలంలో చేటు చేసుకున్న అక్రమాలే ఇందుకు ఇందుకు నిలువెత్తు ఉదాహరణ. దాదాపు అరకోటి రూపాయల అక్రమాలు జరిగినట్లు తెలిసినా ఉన్నతాధికరులు ఇంకా మొద్దునిద్రలోనే జోగుతున్నారు. ఇలా ఈ మండలం ఒక్కటే కాదూ.. ప్రతి మండలంలోనూ ఇలా అవినీతి జరిగింది. ఇవన్నీ ఉన్నతాధికారులకు తెలిసినా.. వారిపై చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



అధికారుల అండతోనే అవినీతి..

శాఖలో ఎన్ని అక్రమాలు జరిగినా.. వారిని కొంతమంది ఉన్నతాధికారులు వెనుకేసుకొస్తున్నట్లు ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో దండుకునే సొమ్ములో నుంచి కొంత వాటా ఆయా అధికారులకు వెళ్తుండటమే కారణం. నార్పల మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ అక్రమ అమ్మకాలే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా మండలంలోని ఓ అధికారి ప్రైవేట్ వ్యక్తి ద్వారా ఇష్టారాజ్యంగా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతరాత్ర సామగ్రి అమ్ముకున్నట్లు సమాచారం. ఈక్రమంలో సదరు అధికారిని మూడు నెలల కిందట రిలీవ్ చేసినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఆ ఉద్యోగి ఇప్పటికీ ప్రైవేట్ వ్యక్తితో కలసి కార్యాలయానికి వచ్చి.. స్థానికంగా పనులన్నీ చక్కబెడుతుండటం కొసమెరుపు. ఇలా అక్రమార్కులను వెనకేసుకురావడంతో విద్యుత్‌శాఖ అధికారులకు కొత్తేమీకాదు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చాలానే జరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు రైతుల నుంచి లైన్మెన్లు డబ్బులు వసూలు చేస్తుండటం.. ఈ విషయాలపై కార్యాలయాల్లో గొడవలు జరగడం.. అయినా అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకపోవడం.. ఇక్కడ పరిపాటే.

దండుకోవడమే లక్ష్యం..

విద్యుత్ శాఖలోని కొంత మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంటికీ విద్యుత్ కనెక్షన్ మొదలుకొని.. వ్యవసాయ కనెక్షన్లు, మీటర్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు, విద్యుత్ లైన్ల మార్పు ప్రతి పనికి పైసలు ఇస్తేనే పనులు జరుగుతాయ్.. వ్యవసాయ కనెక్షన్లు మంజూరులో అయితే రైతుల నుంచి వేలకు వేలు దండుకొంటున్నారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై.. రైతుకు చేరాలంటే రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఇచ్చుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అవీ అన్నీ సక్రమంగా ఇస్తారంటే అది లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తే.. విద్యుత్ స్తంభాలు ఇవ్వరూ. .ఆ రెండు ఇస్తే.. కండెసర్, ఇతరాత్ర సామగ్రి ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా అపార్ట్‌మెంట్లకు కనెక్షన్లు ఇవ్వాలంటే ఎవ్వరికీ ఎంత ఇచ్చినా ఓ అధికారికి మాత్రం రూ.10 వేలు ఇవాల్సిందే అంటున్నారు. లేదంటే ఫైల్ ముందుకు కదలదు. సంస్థలోని ఓ ఉన్నతాధికారికి ప్రతినెలా ఒక్కొక్క డివిజన్ నుంచి రూ.50 వేలు వెళ్లాల్సిందే. ఇదేమీని ప్రశ్నిస్తే.. తనకేమీ ఈ పోస్టు ఊరికే రాలేదు.. కోట్లు గుమ్మరించి చెచ్చుకున్నాం అంటున్నాడు. జిల్లాలోని ఓ ఉన్నతాధికారి కూడా తన పోస్టు కోసం రూ.30 లక్షల పెట్టి మరి తెచ్చుకున్నట్లు సమాచారం.



మీటర్ల ఏర్పాటుపై రైతుల ఆగ్రహం



నిరసన తెలుపుతున్న రైతులు

ఉరవకొండ, ఏప్రిల్ 12: వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వజ్రకరూరు మండలంలోని చాయాపురం గ్రామంలో శుక్రవారం వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బందిపై పొలాల్లోనే రైతులు తిరగబడ్డారు. తమ అనుమతులు లేకుండా, కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా మీటర్లను ఎలా బిగిస్తారంటూ సిబ్బందిని నిలదీశారు. అప్పటికే బిగించిన మోటార్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, మీటర్లు ఎందుకు బిగిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు తమ్మినేని నాగభూషణం, సర్పంచ్ మనోహర్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు దుర్మార్గమైన చర్య అన్నారు. మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

మీటర్లను ధ్వంసం చేస్తాం: ఏపీ రైతు సంఘం

వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగిస్తే వాటిని ధ్వంసం చేస్తామని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మనోహర్ హెచ్చరించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు నట్టేట మునిగారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక మిర్చి రైతులు పొలాల్లోనే రాశులు పోసుకుని అమ్ముకునేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మీటర్ల ఏర్పాటుతో వేధించడం తగదన్నారు.

అడ్డుకుంటున్న రైతులు



మద్య నిషేధంపై మాట తప్పిన సీఎం

- జగన్‌పై మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం
- మద్యంలో రూ.లక్ష కోట్లు దోపిడీ చేశాడని ఆరోపణ

అనంతపురం ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దశలవారిగా మద్యపాన నిషేధం చేస్తానంటివి.. ఐదేళ్ల కాలంలో ఆ ఊసే ఎత్తలేదు..ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతున్నావ్..అని మాజీ మంత్రి, రాప్తాడు కూటమి అభ్యర్థి పరిటాల సునీత సీఎం జగన్‌ను ప్రశ్నించారు. శుక్రవారం అనంతపురంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... సీఎం జగన్ మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని రూ. లక్ష కోట్లు దోపిడీ చేశాడని ఆరోపించారు. మద్యపాన నిషేధం పేరుతో మహిళలను మోసం చేశారని ఆగ్రహించారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టడం దారుణమన్నారు. 2021లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో రాష్ట్రంలో దాదాపు 31.4 శాతం మంది మద్యం సేవిస్తున్నారని తేలిందన్నారు. ఐదేళ్లల్లో మద్యం తాగేవారి సంఖ్య మరింత పెరిగిందేగానీ తగ్గలేదన్నారు. మద్యం మాఫియా ద్వారా జే గ్యాంగ్ రూ.లక్ష కోట్లను అప్పనంగా దోచేసిందని ఆమె ఆరోపించారు. మద్యం బ్లాక్ మార్కెట్ అమ్మకాల డబ్బంతా తాడేపల్లి ప్యాలెక్‌కు తరలిపోయిందని విమర్శించారు. మద్యం అమ్మకాల మీద వచ్చే ఆదాయాన్ని సీఎం జగన్ మరో 20 ఏళ్లకు తాకట్టుపెట్టడం సిగ్గుచేటన్నారు. జగన్‌రెడ్డి జే బ్రాండ్ కారణంగా జంగారెడ్డి గూడెంలో 25 మంది చనిపోయారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది అనారోగ్యం పాలయ్యారన్నారు. వీటన్నింటికీ జగన్ సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. జగన్‌రెడ్డి మద్యం లెక్కలన్నీ తేలుస్తామని ఆమె స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న పరిటాల సునీత

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 12: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవ రెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి, మార్చిలో బీఫార్మసీ ప్రథమ సంవత్సరం ఒకటవ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిండం జరిగిందన్నారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్15), ద్వితీయ సెమిస్టర్(ఆర్19,15) సప్లమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. ఫార్మా-డీ ఐదవ సంవత్సరం(ఆర్17) రెగ్యులర్, సప్లమెంటరీతోపాటు ఫార్మా-డీ(పీ.బీ) తృతీయ సంవత్సరం(ఆర్17) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మద్యంతో మహిళల తాళిబొట్లు తెంచాడు

- సీఎం జగన్‌పై టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీవీ మండిపాటు

అనంతపురం/పుట్టపర్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్య నిషేధ హామీ అమలు చేయకపోగా నకిలీ మద్యంతో ఎందరో మహిళల తాళిబొట్లు తెంచిన వ్యక్తి సీఎం జగన్ అని సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు మండిపడ్డారు. మద్యపాన నిషేధం హామీపై వైసీపీని నిలదీయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీఎం జగన్‌రెడ్డి మద్యపాన నిషేధం ముసుగులో రూ.లక్ష కోట్లు లూటీ చేశాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జే బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడిన వ్యక్తి జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి , మద్యాన్నే ఆదాయంగా మార్చుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మద్యపాన నిషేధ అమలు కోసం జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడైనా డీ అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించారా..? అని సూటిగా ప్రశ్నించారు. మద్యపానాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని, అవినీతి ద్వారా రూ. కోట్లు కొల్లగొట్టేందుకే మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లను నిషేధించారన్నారు. జగన్‌రెడ్డి సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి అక్రమ మద్యం వ్యాపారంలో ఆరితేరిపోయారన్నారు. ఏపీబేవరైజెస్ కార్పోరేషన్ ఛైర్మన్ వాసుదేవరెడ్డి కనుసన్నల్లోనే మద్యం మాఫియా అరాచకాలు పేట్రేగిపోతున్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అభ్యర్థులకు అక్రమంగా మద్యం సరఫరాకు వాసుదేవరెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో కూటమిదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న బీవీ వెంకటరాముడు

కానిస్టేబుల్‌పై వేటు..?

- మద్యం తరలిస్తూ వైసీపీ నాయకుడితో పట్టుబడిన వైనం

చిలమత్తూరు, ఏప్రిల్ 12: మద్యం తరలిస్తున్న ఓ కానిస్టేబుల్‌పై వేటు పడింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో ఎస్.ఐ హసేన్‌పురానికి వెళ్లి తిరిగి వస్తుండగా అర్ధరాత్రి సమయంలో వీరాపురం వైపు నుంచి కారు ఎదురుగా వచ్చింది. పోలీస్ సైరన్ మోగించడంతో ఆ కారులో ఉన్న వ్యక్తులు తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వారిలో కానిస్టేబుల్ కూడా ఉన్నట్లు ఎస్ఐ గుర్తించారు. ఆ కారు వెంట అనుసరిస్తున్న మరో ద్విచక్రవాహనం అదీ కానిస్టేబుల్‌ది కావడం, ద్విచక్రవాహనంలో మండల ప్రజాప్రతినిధి బంధువు ఉన్నాడు. ఇతను పలు దఫాలుగా మద్యం కేసుల్లో పట్టుబడినట్లు తెలిసింది. ఆ కారులో ఉన్నది మద్యమేనని ఎస్ఐ గుర్తించారు. ఆ కానిస్టేబుల్ విధులకు హాజరుకాకపోవడంతో అనుమానం వచ్చి విచారించారు. అసలు విషయం బయట పడినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో విషయం బయటికి పొక్కకుండా వీఆర్‌కి పంపారు. దీనిపై పోలీసు అధికారిని వివరణ కోరగా జరిగిన విషయం విధితమే కానీ, ఎన్నికల కోడ్ కారణంగా ఉన్నతాధికారులు విషయాన్ని తెలియజేస్తామన్నారు.

రూ.3.65లక్షల నగదు సీజ్

అనంతపురం క్రైం, ఏప్రిల్12 : ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తీసుకెళ్తున్న రూ.3.65లక్షల నగదును వేర్వేరుగా టూటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో టూటౌన్ సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ రుష్యేంద్రబాబు, పోలీస్ సిబ్బంది స్థానిక రైల్వే గేటు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన పి.రామాంజనేయులు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2.65లక్షల నగదు తీసుకెళ్తుండగా పట్టుబడ్డాడు. పోలీసులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సిబ్బంది ఆ నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ నాగమధులు రుద్రంపేట సర్వీస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ధర్మవరం పట్టణం రాజేంద్ర నగర్‌కు చెందిన గుర్రం శివకుమార్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష నగదు తీసుకెళ్తుండగా పట్టుబడ్డాడు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌తో కలిసి ఆ డబ్బు సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

ధర్మవరంలో రూ.2.57 లక్షలు...

ధర్మవరం : ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.2.57లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎర్రగుంట్ల సర్కిల్‌ల్లో తనతోపాటు ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బెంగుళూర్ రూరల్ హోసకోట్ మండలం హసగల గ్రామానికి చెందిన కృష్ణప మోహన్‌కుమార్ ఎటువంటి బిల్లులు లేకుండా వాహనంలో నగదును తీసుకుకెళ్తుండటంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

వికటించిన అన్నప్రసాదం

- వందమందికి పైగా ఆస్పత్రిపాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



ఆందోళన చెందుతున్న కుర్లపల్లివాసులు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 12: కనగానపల్లి మండలం కుర్లపల్లి గ్రామంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. అన్నదానం అనంతరం శుక్రవారం వందమందికి పైగా భక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుర్లపల్లిలో నూతన ఆలయం నిర్మించి, సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నదానం నిర్వహించారు. పాయసం, పులిహోర తదితర పదార్థాలను వడ్డించారు. వీటిని తిన్నవారు సాయంత్రం 6.30 గంటల నుంచి వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడ్డారు. గంట వ్యవధిలో వందమందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్థులు బాధితులను 108తో పాటు వివిధ వాహనాల్లో ధర్మవరం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో గ్రామాన్ని సందర్శించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులను పిలిపించి ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. పాయసంలో రుచికోసం కలిపిన నూనెలాంటి పదార్థం కారణంగా ఇలా జరిగి ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు. శుభకార్యం నిర్వహించిన గ్రామస్థులు.. తమ బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు అస్వస్థతకు గురి కావడంతో ఆందోళనకు లోనయ్యారు. బాధితులను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.



సెలైన్‌బాటిళ్లతో..



ఆస్పత్రిలో చిన్నారికి సెలైన్



బాధితులను పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్



టీడీపీలో చేరిన నాయకులతో మాజీ మంత్రి పల్లె

ఎంపీపీ స్వగ్రామంలో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన వలంటీర్లు, వైసీపీ నాయకులు

బుక్కపట్నం, ఏప్రిల్ 12: ఎంపీపీ స్వగ్రామంలో వైసీపీకి షాక్ తగిలింది. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామాచేసి వైసీసీ అభ్యర్థుల వెంట ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎంపీపీ స్వగ్రామమైన మండలంలోని గసికవారిపల్లిలో వలంటీర్లు రవి, రమణ ఉద్యోగాలకు రాజీనామా చేసి, శుక్రవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారితోపాటు మరో పది కుటుంబాలు వైసీపీనుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. వలంటీర్లకు రూ.10వేల వేతనం ప్రకటించడం హర్షణీయమన్నారు. పల్లె రఘునాథ రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు.

చీనీకాయలు టన్ను రూ.41 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.41వేలు, కనిష్ఠంగా రూ.20వేలు, సరాసరి రూ.30 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 768 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పరీక్షలు తప్పామని..

ముగ్గురి ఆత్మహత్యాయత్నం.. ఒకరి మృతి

గుంతకల్లు టౌన్/చెన్నేకొత్తపల్లి/ధర్మవరం రూరల్, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షలో ఫెయిలైనందుకు మనస్తాపంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగ్గురు విద్యార్థినులు ఆత్మహత్యకు యత్నించారు. వీరిలో గుంతకల్లు పట్టణానికి చెందిన ఎస్ నందిని(18) మృతిచెందారు. మిల్లు కాలనీకి చెందిన రాఘవేంద్ర కూతురు నందిని.. స్థానిక నారాయణ కళాశాలలో ఇంటర్ చదివింది. ద్వితీయ సంవత్సరం మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యింది. దీంతో మనస్తాపం చెంది, ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

- శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన చైతన్య ఇంటర్ ఫెయిలైనందుకు మనస్తాపంతో విష రసాయనం తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చైతన్య ధర్మవరం పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదివింది. ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన మానస ద్వితీయ సంవత్సరం ఒక సబ్జెక్టులో ఫెయిలైంది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో విష రసాయనం తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స కొనసాగుతోంది. మానస ధర్మవరం పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదివింది.



నందిని మృతదేహం

వైసీపీ ప్రచారంలో ఎంఎల్‌ఓ

రాయదుర్గం, ఏప్రిల్ 12: ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఎంఎల్‌ఓలు వైసీపీ ప్రచార సేవలో మునిగి తేలుతున్నారు. కణేకల్లు మండల ఎంఎల్ఓ సుంకేష్ శుక్రవారం బొమ్మనహాళ్ మండలంలో జరిగిన వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ ప్రచార రథం ఎక్కి వారి ఫొటోలు, వీడియోలు తీస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నాడు. ఉద్దేహాళ్ నుంచి ఉంతకల్లు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుంకేష్ పాల్గొన్నారు. అయితే అధికారులు సుంకేష్‌పై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



ప్రచార రథంపై సుంకేష్

కేజీబీవీ, ఆదర్శ విద్యార్థినుల ప్రతిభ


శృతి లేఖనా హేమలత

గార్లదిన్నె, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో స్థానిక కేజీబీవీ విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న 11 మంది విద్యార్థినులూ పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో శృతి 1000కి 947 మార్కులు, లేఖన 937 మార్కులు, హేమలత 901 మార్కులు సాధించారు. అలాగే గార్లదిన్నె ఆదర్శ పాఠశాలలో ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో గీతా 1000 మార్కులకుగాను 774 మార్కులు, ఎంపీసీలో కుసుమకుమారి 939 మార్కులు, సీఈసీలో మైత్రి 922 మార్కులు సాధించారు.


గీత కుసుమకుమారి మైత్రి


శిరీష

● **అనంతపురం రూరల్**: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మండలంలో కురుగుంట అంబేద్కర్ జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. కళాశాలలోని సీనియర్ ఇంటర్ సిఈసీలో హెచ్ శిరీష 959 మార్కులు సాధించింది. సీనియర్ ఇంటర్‌లో 74 మంది విద్యార్థినిలుండగా..73 మంది, జూనియర్ ఇంటర్‌లో 65 మందిగాను..64 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.

● **రాప్తాడు** : మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మైత్రి 1000 మార్కులకు 952 మార్కులు, ఆదర్శ పాఠశాల విద్యార్థిని ప్రణతి 946 మార్కులు సాధించారు. .


మైత్రి ప్రణతి

● **శింగనమల**: శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 58 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. శింగనమల కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 36 మంది విద్యార్థులు పరీక్ష రాయాగా 21 మంది ఉత్తీర్ణత సాధించారు. సీఈసీ గ్రూప్‌లో వినోద్ కుమార్ నాయక్ 1000కి 890, శ్రీహర్షణి 856 మార్కులు సాధించారు. సొదనపల్లి గ్రామానికి చెందిన రమణి అనంతపురం కురుకుంట అంబేడ్కర్ పాఠశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతూ 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించింది.


రమణి వినోద్‌కుమార్ శ్రీహర్షణి

● **రామగిరి**: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో ద్వితీయ సంవత్సరంలో 27 మంది పరీక్షలు రాయగా 23 మంది ఉత్తీర్ణులయ్యారు. సీఈసీలో అంజలి (861) ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 40 మంది పరీక్షలు రాయగా ఇందులో 27 మంది ఉత్తీర్ణులయ్యారు.

● **చెన్నేకొత్తపల్లి**: ఇంటర్ ద్వితీయసంవత్సర ఫలితాల్లో కేజీబీవీ 74 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 19 మంది విద్యార్థినిలు పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. అందులో శ్రీవాణి(824), హారిక(803), అపర్ణ (780)మార్కులు సాదించారన్నారు. అదేవిధంగా ఏపీ మోడల్ స్కూల్‌లో 40 శాతం ఉత్తీర్ణతసాధించారు. 33 మందికిగాను 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. అందులో ఎంపీసీలో మాదవి 920, బైపీసీలో కావ్యశ్రీ 648, సీఈసీలో భరత్ 630 మార్కులు సాదించారు.

● **నార్పల**: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ఫలితాలలో 75శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బాలప్ప తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఈనెల 18నుంచి 24 వరకు ఫీజు చెల్లించాలని, మే 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి


దుగుమర్రిలో ప్రచారం చేస్తున్న బండారు శ్రావణి

నార్పల, ఏప్రిల్ 12: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి అన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడితో కలిసి ఆమె శుక్రవారం మండలంలోని దుర్గం, సిద్దలాచెర్ల, గొల్లపల్లి, కమ్మకొట్టాల, మాలవాండ్లపల్లి, దుగుమర్రి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు, ఆకుల ఆంజనేయులు, పిట్టురంగారెడ్డి, ఆకుల నాగార్జున నాయుడు, ఎర్రినాగప్ప, ఆకుల తేజ పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రంలోని అనంతసాగర్ కాలనీ, విజయ నగర్ కాలనీలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు ప్రచారం నిర్వహించారు.

అదృశ్యమైన విద్యార్థి అప్పగింత

నార్పల, ఏప్రిల్ 12: గుత్తి మండలంలోని టీ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓబుల హరికృష్ణ కుమారుడు రేవంత్‌కుమార్ నార్పల మండలంలోని కేశేపల్లి గ్రామంలో బంధువుల ఇంట్లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఉగాదికి సెలవులకి ఇంటికి ఈ నెల ఆరో తేదీన బయలుదేరిన రేవంత్‌కుమార్.. డబ్బులులేక యాడికిలో ఉండిపోయాడు. అక్కడ చెన్నకేశవస్వామి గుడి వద్ద ఉండగా.. గమనించిన స్థానికులు వివరాలు తెలుసుకొని.. నార్పల పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు.. విద్యార్థి తండ్రి హరికృష్ణను స్టేషన్‌కు పిలిపించి, బాలుడిని అప్పగించారు.







బైపీసీ జిల్లా టాపర్‌ను అభినందిస్తున్న తేజ కాలేజ్ డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కాలేజ్ సిబ్బంది, నలంద విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఇంటర్‌లో అనంత ప్రతిభ

అనంతపురం విద్య, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షల ఫలితాల్లో నగరంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల విద్యార్థు లు సత్తాచాటారు. జూనియర్, సీనియర్ ఎంపీసీ, బైపీసీ ఇత ర కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించారు. వారి ఇళ్లలో, కళాశాల్లో ఆనందం నెలకొంది. స్వీట్లుపంచి ఆనందంవ్యక్తం చేశారు.

● తేజ విద్యార్థుల హవా : నగరంలోని తేజ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బైపీసీలో జిల్లాలోనే టాప్ మార్కులు సాధించారని, తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి ప్రకటించారు. ఉత్తమ మార్కులు సాధించడంతో రఘువీరా టవర్స్ వద్ద టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. తర్వాత వారు మీడియాతో మాట్లాడుతూ.. జూనియర్ ఇంటర్ బైపీసీలో విద్యార్థులు రమ్యశ్రీ 436 మార్కులు, ఫాతిమ సుమెయ్యా 435 మార్కులు, మానస 435 మార్కులు సాధించారని, ఎంపీసీలో శృతి 464 మార్కులు, హాసిని 462 మార్కులు, నవనీత్ క్రిష్ణ 462 మార్కులతో కాలేజ్‌లోనే బెస్ట్ మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ ఆంజనేయులు, డీన్ సుబ్బయ్య, ప్రిన్సిపాళ్లు శ్రీచైతన్య, నేత్రవాణి పాల్గొన్నారు.

● నారాయణ కాలేజ్ : నారాయణ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విద్యార్థులు త్రైత 991 మార్కులు, అవినాష్ 990, భవ్యసాయి 989, మేఘన 989, యశశ్విని 989, ఫిర్దోస్ 986, సాయి, బైపీసీలో ఈశ్వర్‌రెడ్డి 986 మార్కులు, ఎంపీసీలో మహేశ్వరి 985 మార్కులు సాధించారని తెలిపారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అభినవ్ రెడ్డి, నిరంజన్, దుర్గాప్రసాద్, యోషిత, సింధు, శ్రీపూజిత, రాజేష్, మహ్మద్ హైదర్ వలి, గీత, షైక్ ఫైజా నిఖత్, హర్షిణి 465 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో తేజస్విని 432 మార్కులు, మహిత 429 మార్కులు, నిత్యశ్రీ 429 మార్కులు, జ్యోతిర్మయి 426 మార్కులు, సింధురం 426 మార్కులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎంలు హరిప్రసాద్, రాజశేఖరరెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, హిమబిందు, శిఖామణి, జయలక్ష్మి, శ్రీధర్‌బాబు, ఈశ్వరి, ఓబన్న గౌడ్ పాల్గొన్నారు.

● నలందా ... : నలందా విద్యార్థుల మెరుగైన మార్కులు సాధించడంతో ప్రిన్సిపాళ్లు ఖాజీబాబు, వినోద్‌బాబు వారిని అభినందించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో లోకేశ్వరి 978 మార్కులు, పవన్‌కుమార్‌రెడ్డి 977 మార్కులు, భవ్య 975, జ్యోతి 970, హైందవి 969 సాధించారని, ఎంఈసీలో నాగసుమన 967, నందిని 959, చరిత 953, సీఈసీలో లతశ్రీ 960, జ్యోతి 943, ఐశ్వర్య 940 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో వైష్ణవి 960, అల్పియ 952, దీప్తిశ్రీ 944 సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో నిహారిక 463, శివానందరెడ్డి 462, షణ్ముఖి 461, హర్షిత చౌదరి 460, సాయి అక్షయ్ 460, ఎంఈసీలో శబరి నాథ్ 482, పర్హాన 475, హర్షవర్ధన్ 472, బైపీసీలో పల్లవి, దీక్షత 422 మార్కులు, ఇందు 420 మార్కులు, సీఈసీలో నివేదిక 472 మార్కులు, పల్లవి 462 మార్కులు, భారతి 459 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

● వివేకానంద కాలేజ్: బెస్ట్ మార్కులు సాధించిన విద్యార్థులను వివేకానంద ఎడ్యుకేషనల్ అకాడమీ అధినేత రవీంద్ర చౌదరి, ప్రిన్సిపాళ్లు ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఆలిషా 983 మార్కులు, జాహ్నవి 982 , బైపీసీలో కావేలి 965, భాను 964, అఖిల 964, సీఈసీలో హర్షిత 964 మార్కులు సాధించారని, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో మంజునాథ్ 967, గురుకిరణ్, హరికిరణ్ 465, వినీల్‌కుమార్‌రెడ్డి, రాజేష్, రామ్ ప్రకాష్ 464, రామ్ ప్రకాష్, హనుమంత, నగేష్, అఖిలేష్, శ్రీకాంత్‌రెడ్డి, పల్లవి 463 మార్కులు, బైపీసీలో పోషణ 434, రేణుక 430, సీఈసీలో అంకిత 487, జ్యోత్స్న 484, మమత 482 మార్కులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, రాంగోపాల్, జేవీ రమణ, బ్రహ్మానందరెడ్డి, సంజీవరాయుడు, మురళీధర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

● శ్రీసాయి: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు శ్రీసాయి కాలేజ్ కరస్పాండెంట్ మాధురి రాజేశ్వరి పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీలో స్వాతి 981 మార్కులు, నిహారికి 980 మార్కులు సాధించారన్నారు. కళాశాలలో 400 మంది ఉత్తీర్ణత పొందారని, 80 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సంజీవప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● విజ్ఞాన్ కాలేజ్: విజ్ఞాన్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్‌లో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను కరస్పాండెంట్ శివశంకర్ అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అమిష్ సత్యశర్మ 463 మార్కులు, గిరిధర్ కుమార్ 447 మార్కులు, గణేష్‌కుమార్ 441 మార్కులు, కౌశల్య 439 మార్కులు, ధనలక్ష్మి 435 మార్కులు, సీఈసీలో మధు 400, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో అక్షయరెడ్డి 982, సాయిరాం శ్రీపాద 965, నిపున్ సిద్దార్థ 959, బాలక్రిష్ణ 958 లక్ష్మినేశ్వర్ 957, అర్షద్ 951, సంగీత 945, బైపీసీలో మధులత 895 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రమాదేవి, తులసీదాస్ పాల్గొన్నారు.

● వికాస్ కాలేజ్ : ఇంటర్ సెకెండ్ ఇయర్ పరీక్షల్లో పూజిత 987, భావనరెడ్డి 983, వసుధశ్రీ 980, భానుప్రకాష్ 975, వినిష 974 మార్కులు సాధించారని, మొదటి ఏడాది పరీక్షల్లో సాయి మారుతి 459 మార్కులు, సూర్యతేజ 454 మార్కులు, రామ్‌చరణ్ 448 మార్కులు, కౌషిక్ 445 మార్కులు, జాహ్నవి 445 మార్కులు సాధించారని డైరెక్టర్లు జయభాస్కర్, సుబ్రమణ్యం పేర్కొన్నారు.

● గ్లోబల్ కాలేజ్: ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను గ్లోబల్ కాలేజ్ ప్రిన్సిపాల్ నిర్మల అభినందించారు. ఆమె మాట్లాడుతూ... ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో స్పందన, భవ్యశ్రీ, అస్త్రిత 463 మార్కులు, నాహియ 461, హంసిత,నీతూ, హరిత, హేమసుధ 460 మార్కులు సాధించారన్నారు.









ప్రతిభా విద్యార్థులను అభినందించినస్తున్న వివేకానంద జూనియర్ కళాశాల సిబ్బంది. మంచి మార్కులు సాధించిన విజ్ఞాన్ కాలేజ్ విద్యార్థులతో సిబ్బంది. ఉత్తమ మార్కులు సాధించిన శ్రీసాయి విద్యార్థులు స్వాతి, నిహారిక

బాధిత రైతుకు చేయూత

గార్లదిన్నె: మండలంలోని కల్లూరుకు చెందిన రైతు ఈఖాది జమ్మన్నకు చెందిన చీనీ, మామిడి, మొక్కజొన్న తోటకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన విషయం తెల్సిందే. దీంతో ఆర్థికంగా నష్టపోయిన అతన్ని శింగనమల నియోజకవర్గం టీడీపీ ద్విసభ్య కమిటి సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, బండారు శ్రావణి శ్రీ సోదరి బండారు కిన్నరశ్రీ శుక్రవారం పరామర్శించారు. ఆ తోటలను పరిశీలించారు. కేశవరెడ్డి రూ. 20వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల వెంకటేసు, టీఎన్‌టీయూసి జిల్లా అధికార ప్రతినిధి బాబయ్య, వడ్ల రాము, గంగాధర్, సామాల మధు, సుధాకర్‌రెడ్డి, నాగేష్, నలపరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆ తోటను ఎస్ఐ గౌస్‌బాషా పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురంరూరల్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ లక్ష్మి నారాయణ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు రుద్రంపేట మెయిన్ రోడ్డు, సైపుల్లా కాలనీ, చంద్రబాబు కొట్టాల, విశ్వశాంతినగర్, చర్చి కాలనీ, పీవీకేకే కాలేజీ, గాయత్రిమిల్క్ డైరీ, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

చెన్నేకొత్తపల్లిలో 'జయహో బీసీ'

చెన్నేకొత్తపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్ బీసీల సంక్షేమాన్ని పూర్తిగా మరచిపోయారన్నారు. గతంలో టీడీపీ స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తే సీఎం జగన్ 24 శాతానికి తగ్గించారన్నారు. బీసీల కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారే తప్పా వాటికి ఎక్కడ నిధులు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈ ఎన్నికలలో బీసీలందరూ టీడీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి వడ్డేనాగేంద్ర, టీడీపీ రాష్ట్ర శాలివాహన కన్వీనర్ పోతలయ్య, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, యజ్ఞేశంకర్ పాల్గొన్నారు.

కామారుపల్లిలో టీడీపీ ప్రచారం

అనంతపురంరూరల్: మండలంలోని కామారుపల్లి గ్రామంలో బాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, గ్రామకమిటీ అధ్యక్షుడు పరుశురాం ఇంటింటా తిరుగుతూ బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

28న ఉచిత ఖత్నా


అబ్దుల్ రజాక్ గఫూర్

అనంతపురం కల్చరల్ : ముస్లిం మైనార్టీ చిన్నారుల కోసం ఈనెల 28న గఫూర్ కాలనీలో ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని గఫూర్ హాస్పిటల్స్ అధినేత అబ్దుల్ రజాక్ గఫూర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం గఫూర్ కాలనీలోని గఫూర్ సేవా ట్రస్టు కార్యాలయ ఆవరణంలో ఆయన మాట్లాడారు. ఖత్నా చేయించు కోవ డం వల్ల భయంకరమైన హెచ్ఐవీ, కేన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ఆసక్తి గల ముస్లింలు తమ చిన్నారులకు ఖత్నాను చేయించేందుకు ముందుగా 94400 63212 నెంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఘనంగా సల్లాపురమ్మ జాతర

రాప్తాడు : మండలంలోని బండమీదపల్లి గ్రామంలో సల్లాపురమ్మ అమ్మవారి జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు చేశారు. సల్లాపురమ్మ అమ్మవారి విగ్రహాన్ని స్థానిక ఆలయం వద్ద నుంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. జాతరకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. జాతర సందర్భంగా సల్లాపురమ్మ అమ్మవారి సమీపంలోని ముత్యాలమ్మ అమ్మవారికి కూడా భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం 5 గంటల సమయంలో భక్తులు వేలాది మంది సల్లాపురమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. జాతర సందర్భంగా భక్తులకు అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో కుందేలు పార్వేట నిర్వహించారు. కుందేలును పట్టుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ కుందేలు పార్వేట కార్యక్రమాన్ని భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు.

శిల్పారామంలో అలరించిన నృత్యప్రదర్శన

అనంతపురంరూరల్ : శిల్పారామంలో నిర్వహించిన సినీ నృత్య ప్రదర్శనలు చూపర్లను అలరించాయి. శుక్రవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని శిల్పారామంలో ధర్మవరానికి చెందిన మాసన నృత్య కళాకేంద్రం శిష్యబృందం సినీ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారులు మహాగణపతిం, లంబాడినృత్యం, కళ్లజోడు కాలేజీ, స్వామి నా స్వామి, ఆ కుర్చీని మడతపెట్టి, రఘుపతిరాఘవ రాజారామ్ తదితర పాటలకు నృత్య ప్రదర్శనలు చేశారు. రంజాన్ పండుగ కావడంతో శిల్పారామం ముస్లింలతో కిటకిటలాడింది. కుటుంబ సభ్యులతో కలసి శిల్పారామంలో సందడి చేశారు. పిల్లలు, పెద్దలు సంతోషంగా గడిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంజాయ్ చేశారు.

పగడ్బందీగా ఈవీఎం, వీవీప్యాట్స్ ర్యాండమైజేషన్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 12: ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టరేట్‌లో పగడ్బందీగా చేపట్టినట్లు కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ నేపథ్యంలో శుక్రవారం అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో మినీకాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే ర్యాండమైజేషన్ ప్రారంభించామని, రోజూ ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల కమిషన్ ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల ర్యాండమైజేషన్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిందని, రాజకీయపార్టీల సమక్షంలో డీఈఓ లాగిన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకంగా ర్యాండమైజేషన్ చేపట్టామని అన్నారు. అనంత పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఎనిమిది నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు, వీవీప్యాట్స్ ర్యాండమైజేషన్ చేపట్టామన్నారు. ర్యాండమైజేషన్ ముగిసిన తర్వాత నియోజకవర్గాలకు ప్రత్యేక వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్‌తో ఏర్పాటు చేసి తరలించామన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఏఎస్పీ విజయబాస్కరరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలను అప్రమత్తం చేయండి

అనంతపురం టౌన్: ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించేలా అప్రమత్తం చేయాలని అధికారులకు కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వడదెబ్బ నివారనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టల్స్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అంగన్‌వాడీలలో కుండలను ఏర్పాటు చేసి పిల్లలకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని సూచించారు. ఉపాధి పనులు ఉదయం పూట కూలీలకు పనులు చూపాలన్నారు. పనిప్రాంతాల్లో షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సమస్యలు తెలిపిన వెంటనే స్పందించి అక్కడ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీపీఓ ప్రభాకరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ. దేవి, డీఆర్‌డీఏ, డ్వామాపీడీలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన ఎస్పీ

అనంతపురం క్రైం : స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌రూంలను ఎస్పీ అమిత్‌బర్దర్ పరిశీలించారు. శుక్రవారం ఆయన పోలీస్ అధికారులతో కలిసి వాటిని పరిశీలించారు. అదేవిధంగా శింగనమల, అనంతపురం అర్బన్, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరచనున్న స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలను పరిశీలించారు. ఆయన వెంట ఏఆర్ అదనపు ఎస్పీ లక్ష్మినారాయణరెడ్డి, అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, త్రీటౌన్ ఎస్ఐ గోపాలుడు ఉన్నారు.

అంతటా సమస్యలే

● వైసీపీ ఐదేళ్లలో చేసింది శూన్యం

● కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 12: అనంతపురం నగరంలో ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని, వైసీపీ ఐదేళ్లల్లో చేసింది శూన్యమని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ మండిపడ్డారు. 26వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డు, హమాలీ కాలనీల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూప ర్ సిక్స్ పథకాలపై వివరించారు. దగ్గుబాటికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఘన స్వాగతం పలికారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతు న్నామని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు అధ్వానంగా తయారయ్యాయని ఆయన దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో నాయకులు బుగ్గయ్య చౌదరి, విశాలాక్షి, రాజారావు, రాయల్ మురళి, జనసేన నాయకులు బాబురావు, కాయగూరల లక్ష్మీపతి, చలపతి పాల్గొన్నారు.

● రుద్రంపేట పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన 200 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి దగ్గుబాటి ప్రసాద్ టీడీపీ జెండాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

● శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో బిషప్ శామ్యూస్ శ్రీనివాస్, పాస్టర్లు ఉదయ్, శ్యామ్ స్వరూప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు పాస్టర్లు ఆశీర్వాదం అందించారు. రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

● మద్యపాన నిషేధం హామీ ఏమైందని సీఎం జగన్‌ను దగ్గుబాటి ప్రశ్నించారు. 99 శాతం హామీలు నెరవేర్చామని జగన్ అసత్యప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మద్యాన్ని నిషేధించకపోగా.. దాన్నే ఆదాయ వనరుగా మార్చుకున్నారని, నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు.


గజమాలతో దగ్గుబాటికి స్వాగతం

జనసేన ప్రచారం

అనంతపురం ప్రెస్‌క్లబ్: స్థానిక 20వ డివిజన్‌లో జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, దగ్గుబాటి సతీమణి శ్రీలక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిని గాలికి వదిలేసిన అవినీతి అనంత వెంకటరామిరెడ్డిని ఓడించి... దగ్గుపాటి వెంకట ప్రసాద్‌ను గెలిపించుకొని... ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సరోజమ్మ, పార్వతి, శైలజ, గురులక్ష్మి, గాయత్రి, మునెమ్మ, జనసేన నగర ప్రధాన కార్యదర్శి పెండ్యాల చక్రపాణి, నాయకులు హనుమప్ప, చెన్నమనాయుడు, సాయిపవన్, గణేష్, ఆది, సత్తార్, ఆది, మల్లికార్జున, గౌతమి, యామిని తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో దగ్గుబాటి శ్రీలక్ష్మి, పెండ్యాల శ్రీలత

భూసార పరీక్షల నిర్వహణపై అవగాహన

అనంతపురం అర్బన్ : అనంతపురం భూసార పరీక్ష కేంద్రంలో ఎస్కేయూలో ఎంఎస్‌సీ కెమిస్ట్రీ చదువుతున్న పలువురు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈనెల 1వ తేదీ నుంచి శుక్రవారం వరకు విద్యార్థులకు మట్టి నమూనాలు సేకరణ, మట్టి పరీక్షలపై అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక భూసార పరీక్షా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ విద్యార్థులకు మట్టి పరీక్షలు చేసే విధానం బుక్‌లెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్షా కేంద్రంలో ఏడీఏ రోజాపుష్పలత, ఏఓలు ఆదిలక్ష్మి, రుమానా బేగం, ఉమామహేశ్వరి, అర్చన, శ్రీనాథ్‌రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.


సింగంపల్లిలో పరిటాల సునీత ప్రచారం

త్వరలో రాక్షస పాలనకు ముగింపు

● కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

ఆత్మకూరు, ఏప్రిల్ 12: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు సాగిన రాక్షస పాలన త్వరలో ముగిస్తోందని, అనంతరం ప్రజాపాలన రాబోతుందని కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని సింగంపల్లి, తండా, వై కొత్తపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిని అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ప్రకాష్‌రెడ్డికి ధైర్యం ఉంటే టీడీపీ చేసిన అభివృద్ధితో పోటీపడాలన్నారు. అభివృద్ధి, ప్రజా సమస్యలు పక్కన పెట్టి స్వార్థప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా ప్రజలను ఇబ్బంది పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ మద్దతుదారులకు సంక్షేమ పథకాలు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. రేషన్ కార్డులు తొలగించి అనేక మంది అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు పునరుద్ధరించి.. ఆదుకొంటామని భరోసా ఇచ్చారు. అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి... వాటిని అమలు చేయకుండానే చేసినట్లు చెబుతూ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాప్తాడులో టీడీపీ భారీ మెజార్టీతో గెలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి బాలాజి, నాయకులు, నారాయణస్వామి, పరుశురామ్, క్రిష్ణమోహన్ చౌదరి, అనీల్ చౌదరి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: పరిటాల సునీత సమక్షంలో ఆత్మకూరు, సింగంపల్లి, తండా గ్రామాలకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు, అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన చెందిన 8 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

ఇంటర్‌లో 'ప్రభుత్వ విద్యార్థుల' ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో మంచి మార్కులు సాధించారు. కొన్ని కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు అభినందించారు.

గుత్తి, ఏప్రిల్ 12: స్థానిక కేజీబీవీలో మొదటి సంవత్సరంలో స్పందన, సుస్మిత విద్యార్థినులు ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ రుద్రాక్షి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 46.47శాతం, ద్వితీయ సంవత్సరంలో 76శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మీనాక్షి తెలిపారు.


మానస


వైశాలి


వెన్నెల

కూడేరు: స్థానిక కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 31 మంది విద్యార్థులు ఉండగా అందరూ ఉత్తీర్ణులైనట్లు ఎస్ఓ ఉమాదేవి శుక్రవారం తెలిపారు. మానస 963 మార్కులు, వైశాలి 957 మార్కులు, వెన్నెల 952 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 30 మందిలో 27 మంది పాసైనట్లు ఆమె తెలిపారు.


శిరీష (906)

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో 25శాతం, ద్వితీయ సంవత్సరంలో 49.15శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలో ఫస్ట్ ఇయర్‌లో 37శాతం, ద్వితీయ సంవత్సరం 75శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో శిరీష 906 మార్కులు సాధించారు. శ్రీశంకరానందగిరిస్వామి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో కే రామ్‌చరణ్ 460, ఎస్ మోహిత్ 442, సుమిత్ర 397 మార్కులు సాధించారు. బైపీసీలో ఫర్హాన్396, వినోద్ 388, సీఈసీలో నవీన్ కుమార్ 430, షేక్ సమీవుల్లా 414 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో షేక్ మెహమ్మద్‌యుసూఫ్ 964, షేక్ మహ్మద్ ఇజాజ్ 956, అమర్నాథ్‌రెడ్డి 937, బైపీసీఓ భార్గవి 933, సీఈసీలో సాయి 819, మాధవి789 మార్కులు సాధించారు.


సిద్ధేశ్వర్(952)


హర్షవర్ధన్ (450)

ఉరవకొండ: స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 83మందికి గానూ, 55మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 141మంది విద్యార్థులకుగానూ 59 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో అమీనా ఫిజా 446, లలిత 442 మార్కులు సాధించారు. బాలుర కళాశాలలో ద్వితీయ సంవత్సరం 93మందికిగానూ, 53మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 154మందికిగానూ 51మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి హర్షవర్ధన్ 450 మార్కులు సాధించాడు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో సిద్ధేశ్వర్ 952 మార్కులు సాధించారు. ఒకేషనల్ గ్రూప్‌లో ప్రథమ సంవత్సరంలో అంజలి 481మార్కులు సాధించింది. ఏపీ మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరం 33శాతం, ద్వితీయ సంవత్సరం 31శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రశస్థకుమారి తెలిపారు. వజ్రకరూరు మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరం 35శాతం, ద్వితీయ సంవత్సరం 38శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు.

పుట్లూరు: స్థానిక ఆదర్శపాఠశాలలో ఇంటర్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు 76 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రవీణ్ ఎంపీసీలో 951మార్కులు, మొదటి సంవత్సరంలో జ్యోత్స్న ఎంపీసీలో 460మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత


రక్షిత (908)

బెళుగుప్ప: స్థానిక కేజీబీవీలో ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో నాగరత్నబాయి శుక్రవారం తెలిపారు. ఇం టర్ సెకెండియర్‌లో 19 మందికి గాను అందరూ ఉత్తీర్ణత సాధించారని, ఫస్ట్ ఇయర్‌లో 29 మందికి గాను 25 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. విద్యార్థిని రక్షిత 908 మార్కులు సాధించినట్లు ఎస్‌వో తెలిపారు.

నిరాశాజనకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాలు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు నిరాశాజనకంగా వచ్చాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 16 మందికి గాను నలుగురు, సెకెండియర్‌లో తొమ్మిదిమందికి ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

కణేకల్లు: స్థానిక జూనియర్ కళాశాలలో 90.69 శాతం ఉత్తీర్ణత సాధించారు. 86 మంది విద్యార్థులకు గాను 78 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కణేకల్లు గురుకుల పాఠశాలలో 32 మంది సెకెండియర్ విద్యార్థులు పాసయ్యారు. ఆదర్శ పాఠశాలలో 23 మందికి గాను 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఫస్టియర్ 191 మందికిగాను 98 మంది పాసై 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాలలో 45 మందికిగా 34 మంది ఉత్తీర్ణులయ్యారు.


పోషిక(975)


అర్షియాభాను (965)

రాయదుర్గంరూరల్: పట్టణంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ సెకెండియర్ ఫలితాల్లో 71.26 శాతం, ఫస్టియర్‌లో 29.26 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో 246 మందికి పరీక్షలు హాజరు కాగా 72 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. సెకెండియర్‌లో 153 మందికి గాను 109 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 258 మంది హాజరుకాగా 106 మంది ఉత్తీర్ణత సాధించడంతో 41.08 శాతం నమోదైందన్నారు. రెండవ సంవత్సరంలో 136 మందికిగాను 73 మంది ఉత్తీర్ణత సాధించగా 53.67 శాతం నమోదైందన్నారు. సెకెండియర్ ఎంపీసీలో సీఎస్ఈలో అర్షియాభాను 965 మార్కులు సాధించినట్లు తెలిపారు. రెండవ సంవత్సరం ఎంపీసీలో కూన భీమేష్ 954 మార్కులు, నవీన్‌కుమార్ 952 మార్కులు సాధించినట్లు తెలిపారు. పోషిక సెకెండియర్ బైపీసీలో 975 మార్కులు సాధించినట్లు తెలిపారు. పట్టణంలోని బాలిక జూనియర్ కళాశాలలో 167 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకాగా 114 మంది పాసైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ దండు విజయ్‌భాస్కర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో సెకెండియర్ పరీక్ష ఫలితాల్లో 68.26 శాతం వచ్చినట్లు తెలిపారు. కే నాయిల ఫిర్దోస్ 963 మార్కులు, కామోద్‌కవార్ 930 మార్కులు, షాఫియాసిదిక 923 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 240 మంది విద్యార్థినులకు గాను 73 మంది పాసైనట్లు తెలిపారు. బైపీసీలో తస్లీమ్ 408, జయశ్రీ 399 మార్కులు, ఎంపీసీలో తబ్సిన్ 333, భారతి 324 మార్కులు, ఆర్ట్స్‌లో నందిని 423, కృష్ణమి 419, పుష్పాంజలి 410 ప్రథమ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించారు.

జితేంద్రగౌడుతో అంబికా భేటీ

గుంతకల్లు, ఏప్రిల్12: ఎన్నికల ప్రచారం నిమిత్తం శుక్రవారం గుంతకల్లుకు వచ్చిన టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడుతో భేటీ అయ్యారు. పట్టణంలోని 17వ వార్డులో సమావేశానంతరం అంబికా లక్ష్మీనారాయణ ఆర్టీ స్ట్రీట్‌లోని జితేంద్రగౌడు స్వగృహానికి వెళ్లారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు మద్దతునివ్వాలని కోరారు. జితేంద్రగౌడు మాట్లాడుతూ తన వెంట ఉండి పనిచేసిన ఎందరో కార్యకర్తలు తననే నమ్ముకుని ఉన్నారని, ఎన్నికల తర్వాత వారికి తగిన ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని ఎంపీ అభ్యర్థిని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనాథ్‌గౌడు, అనిల్ కుమార్ గౌడు, ముష్టూరు తిమ్మప్ప, పాల మల్లికార్జున, ఫజులు పాల్గొన్నారు.


జితేంద్రగౌడుతో భేటీ అయిన ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

టీడీపీ అధికారంలోకి వస్తే కురుబలను ఆదుకుంటాం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 12: టీడీపీ అధికారంలోకి వస్తే కురుబలకు రుణాలిచ్చి ఆర్థికంగా ఆదుకుంటామని అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శుక్రవారం కురుబల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అమిలినేని సురేంద్రబాబు, అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా జనసేన ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, కళ్యాణదుర్గం జనసేన నాయకులు రాజేష్‌లు హాజరయ్యారు. ముఖ్యఅతిథులకు కురుబ కులస్థులు వారి సాంప్రదాయం ప్రకారం కంబలి, గొర్రెపిల్లను బహూకరించారు. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశంపై కురుబలు చూపుతున్న చొరవ ఎనలేనిదన్నారు. బీకే పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే కురుబలకు రాజకీయ అవకాశాలు, ప్రాధాన్యం దక్కిందన్నారు. అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామన్నారు. నియోజకవర్గంలో 114 చెరువులకు నీరిచ్చి రైతులను ఆదుకుంటామన్నారు. ఆ దిశగా మనమందరం టీడీపీ గెలుపుకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గం నుంచి కురుబలు అశేషంగా తరలిరావడంతో సభా ప్రాంగణమంతా దద్దరిల్లిపోయింది.


ఐక్యతను చాటుతున్న అంబికా లక్ష్మీనారాయణ, అమిలినేని సురేంద్రబాబు, పార్థసారథి


భైరసముద్రంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సతీమణి రమాదేవి

ఇంటింటికి తాగునీరు అందిస్తాం

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరసముద్రం, పిల్లలపల్లి గ్రామాలలో శుక్రవారం తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సతీమణి రమాదేవి, కుటుంబ సభ్యులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికి కొళాయి వేయించి తాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనరల్ పాలబండ్ల శ్రీరాములు, సీనియర్ నాయకులు వెంకటేశులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఓబుళేసు, నాయకులు హనుమంతరాయుడు, ప్రహ్లాద, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపడానికి ప్రజలు సిద్ధం: కాలవ

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 12: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలందరూ సంసిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని గొడిశలపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ గర్జన కార్యక్రమంలో కాలవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు సైనికుల్లా పోరాడి పార్టీని అధికారంలోకి తేవాలరాంరకె. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ మంజునాథగౌడ్, టీడీపీ నాయకుడు పాటిల్ అజయ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పుష్పావతి, గంగాధర, మల్లికార్జున తదితర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


మల్లాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న కాలవ భరత్

రాయదుర్గంరూరల్: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లాపురం గ్రామంలో కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్, మురళీకృష్ణ, సదాశివరెడ్డి, డాక్టర్ రామస్వామి, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వైసీపీ ఖాళీ: గుమ్మనూరు

గుంతకల్లు, ఏప్రిల్ 12: వైసీపీ మునిగిపోతోందని తెలిసి అందులోంచి నాయకులందరూ టీడీపీ వైపు వస్తున్నారని, అతి త్వరలో ఆ పార్టీ ఖాళీ కావడం తథ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని 12, 17 వార్డుల్లో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు శుక్రవారం ఉదయం ప్రచార సదస్సులను నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భూకబ్జాలు, అక్రమ కేసులతో ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ప్రజాకంటకుడయ్యాడని విమర్శించారు. కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, అమ్లెట్ మస్తాన్ యాదవ్, పత్తి హిమబిందు, ప్రతాప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని జీ కొట్టాల గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.


మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

గుత్తి: టీడీపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం శుక్రవారం పట్టణంలో వెంకటశివుడుయాదవ్‌ను కలిసి మద్దతు కోరారు. దీంతో పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తామని వెంకటశివుడు యాదవ్ ఆయనకు తెలిపారు.

సూపర్‌సిక్స్ పథకాలతో సుపరిపాలన

పామిడి: టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యపడుతుందని మాజీమంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని దేవరపల్లి, కాళాపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన సూపర్‌సిక్స్ పథకాలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీనియర్ నాయకుల ఇళ్లకు వెళ్లి వారి మద్దతు కోరారు. అలాగే పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో ఆయన సమీక్షించారు.

అభివృద్ధి చేసేవారికి ఓటు వేయండి

యాడికి, ఏప్రిల్12: అభివృద్ధిచేసే వారికే ఎన్నికల్లో ఓటువేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ఓటర్లకు తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయలచెరువులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోరుకొనే వారంతా వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో కదిరి శ్రీకాంత్‌రెడ్డి, రంగనాథరెడ్డి, వేలూరు రంగయ్య, పరిమి చరణ్‌కుమార్, నాగమునిరెడ్డి, బాబు, చలమారెడ్డి, రజక శేఖర్ పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జయనగర్‌కాలనీలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం బీజేపీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్‌యాదవ్ ఇచ్చిన విందుకు జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. వీహెచ్‌పీ నాయకులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణను కలిసిన జేసీ అశ్మిత్‌రెడ్డి రాజకీయ పరిస్థితులపై చర్చించారు.


రాయలచెరువులో ప్రచారం చేస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలి

యాడికి, ఏప్రిల్ 12: కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆపార్టీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం యాడికిలో టీడీపీ, జనసేన, బీజేపీ బూతు కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీని గెలిపించుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. సమావేశంలో గంగాధర్, సునీల్‌కుమార్, నీలకంఠ, ఆదినారాయణ, మధురాజు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్12: ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆర్ఓ రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 274పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 180పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఈ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మండల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రైవేట్ కళాశాలల విద్యార్థుల ప్రతిభ


సాత్విక్


సమీరా భాను


హేమలత


కరిష్మ


వాత్సల్య


సానియా


సాబియా

తాడిపత్రిటౌన్, ఏప్రిల్12: ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పట్టణంలోని సాయిసిద్ధార్థ కళాశాల విద్యార్థులు విజయదుందుంభి మోగించారు. ఇంటర్ ఎంపీసీ విభాగంలో మొదటి సంవత్సరం ఫలితాల్లో వాత్సల్య 470మార్కులకు గాను 465, బైపీసీ విభాగంలో సానియా 440మార్కులకు గాను 433మార్కులు, సీఈసీ విభాగంలో సాబియా సిద్ధిఖా 500మార్కులకు గాను 484, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో సాత్విక్ 989మార్కులు, బైపీసీ విభాగంలో హేమలత 985మార్కులు, సీఈసీ విభాగంలో కరిష్మ 968మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో చాలామంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ప్రతిభచూపిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సత్తాచాటిన సీవీరామన్ విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో సీవీరామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో అనూష 990మార్కులు, కె. జ్యోత్స్న 983మార్కులు, త్రివేణి 981మార్కులు, మధులత 980మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో వినోద్‌కుమార్ 461మార్కులు, అర్చన 459మార్కులు, కులసీమ్‌బీ 457మార్కులు, బైపీసీ విభాగంలో కీర్తన 428మార్కులు, సీఈసీ విభాగంలో సంతోష్‌రెడ్డి 457మార్కులు, పుష్పాంజలి 442మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ బీవీ భాస్కర్‌రెడ్డి తెలిపారు.


అనూష


జ్యోత్స్న


త్రివేణి


మధులత


వినోద్‌కుమార్


కీర్తన


సంతోష్‌రెడ్డి

స్వేచ్ఛగా ఓటేయండి: కలెక్టర్


తోపుడు బండిపై పూలు అమ్మే మహిళకు ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 12: సాధారణ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్‌లో స్వీప్ యాక్టివిటీలలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం టీ సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిర్వహించిన పోలీసు కవాతులో జిల్లా కలెక్టర్ పాల్గొని ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. కంబదూరులో సరిహద్దు ప్రాంతంలో వున్న చెక్‌పోస్టును పరిశీలించారు. కంబదూరు తహసీల్దార్ పనితీరుపై కలెక్టర్ ఆగ్రహించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాణి సుష్మిత, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లుటౌన్,ఏప్రిల్12: పట్టణంలోని మార్కెట్ యార్డులో 33-11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గుంతకల్లు మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఏ రంగస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రాయదుర్గం ప్రాంతంలో రెండు గంటలు..

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 12: రాయదుర్గం పట్టణం, రూరల్, గుమ్మఘట్ట మండలంలో రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం ఏడు గంటల నుండి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

నేడు ఉద్యోగ మేళా

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 12: ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు శనివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. 18 నుండి 26 సంవత్సరాలు కలిగిన మహిళలు, పదవ తరగతి నుండి డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఉద్యోగ మేళాకు అర్హులు అన్నారు. 9513822234 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఏడుగురిపై అట్రాసిటీ కేసు

బెళుగుప్ప, ఏప్రిల్ 12: మండలంలోని జీడిపల్లిలో దళిత యువకుడిపై దాడి చేసిన ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ శుక్రవారం తెలిపారు. బాధితుడు శామ్యూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అరటి పంట దగ్ధం

పెద్దపప్పూరు, ఏప్రిల్12: మండలంలోని ముచ్చుకోట గ్రామానికి చెందిన వలికి సంబంధించి అరటిపంటకు గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పుపెట్టారని ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. బాధిత రైతు వలి 10ఎకరాల్లో అరటిపంటను సాగుచేశాడు. నిప్పుపెట్టడంతో రూ.5లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

కూటమికి పట్టం కట్టండి

ఉరవకొండ,ఏప్రిల్12: రానున్న ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయులు విక్రమ్‌సింహా, విజయ్‌సింహా పేర్కొన్నారు. మండలంలో నింబగల్లు, నెరమెట్ల గ్రామాల్లో శుక్రవారం వారు వేర్వేరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమాలలో రేగాటి నాగరాజు, శ్రీధర్ రెడ్డి, తిమ్మారెడ్డి, నగేష్, సిద్ధప్ప, పుట్టప్ప, గంగాధర్, భగవాన్, నూతన్, సురేష్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ

ఉరవకొండ,ఏప్రిల్12: కర్ణాటక సరిహద్దులోని విడపనకల్లు, డొనేకల్లు చెక్‌పోస్టులను సెబ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టులోని రికార్డులను పరిశీలించారు. చెక్‌పోస్టుల వద్ద తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సెబ్ ఏఈఎస్ శ్రీరామ్, సీఐ పాల్గొన్నారు.

బండారు శ్రావణిశ్రీ ఆర్థిక సాయం

పుట్లూరు, ఏప్రిల్12: మండలంలోని కడవకల్లుకు చెందిన టీడీపీ ఎస్సీసెల్ నాయకులు పెద్దయ్య, తక్కళ్లపల్లి గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని బండారు శ్రావణిశ్రీతోపాటు ఆమె అక్క కిన్నెరశ్రీలు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఇరువురిని పరామర్శించారు. ఆర్థికసాయం అందించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, తాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల తనిఖీ

యాడికి, ఏప్రిల్12: మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ తనిఖీ చేశారు. యాడికి, కోనుప్పలపాడు, గుడిపాడు, నిట్టూరు, వేములపాడు, వెంగన్నపల్లి, రాయలచెరువు, చందన గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో ఉన్న తాజా పరిస్థితులను సమీక్షించారు. ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ నాగార్జునరెడ్డికి సూచించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

గుంతకల్లు, ఏప్రిల్ 12: పట్టణంలోని 10, 12, 17 వార్డుల్లో వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ నేతృత్వంలో టీడీపీలో చేరారు. స్థానిక కథల వీధిలో 10, 12 వార్డులకు చెందిన దాదాపు 300 మంది వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరారు. తిలక్ నగర్‌లోని 17వ వార్డులో 40 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు.

కళ్యాణదుర్గం: కంబదూరు మండలంలోని అయ్యంపల్లికి చెందిన వైసీపీ కార్యకర్త దేవరకొండ హేమంత్‌తో పాటు ఐదు కుటుంబాలు టీడీపీ పార్టీలోకి చేరారు. శుక్రవారం అమిలినేని సురేంద్రబాబు అల్లుడు నవీన్‌చౌదరి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.